టేబుల్ మీద పేపర్ వెయిట్ క్రిందనున్న తెల్లకాగితాలు ఫ్యాన్ గాలికి  రెపరెపమని కొట్టుకుంటున్నాయి. ఒక వైపు యాష్‌ట్రేలో రెడ్‌విల్స్ సిగరెట్ ఘాటు పొగతో వెలుగుతోంది. మరోవైపు కప్పులో టాప్‌స్టార్ టీ వేడిసెగని వదులుతోంది.

రివాల్వింగ్ ఛెయిర్‌లో జారగిలా కూర్చున్న రచయితకు



పి. అనిల్‌కుమార్




సడన్‌గా ఐడియా తట్టింది. పెన్ క్యాప్ తీసి కథ రాయటానికి సిద్ధమయ్యాడు.

– గోపి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు –

అని మొదటి వాక్యం వ్రాసాడు.

అంతే... భళ్లున ఓ ఆకారం అతని ఎదుట ప్రత్యక్షమైంది. రచయిత ఒక్కసారిగా అదిరిపడ్డాడు. చేతిలోని పెన్ ఎగిరివెళ్లి క్రిందపడింది. తెల్లకాగితాలు చెల్లా చెదురైపోయాయి.

అతడు 'ఏమిటిది?' అన్నట్లు భృకుటి ముడివేసి చూసాడు. అంతా బూజరగా కనిపిస్తోంది. కొద్దిసేపటికి కాళ్లూ, చేతులూ, శరీరం, ముఖం ఒక్కొక్కటీ కెమెరా లెన్స్‌కి అడ్జస్ట్ అయినట్టు స్పష్టంగా మారాయి. దానిని పూర్తిగా పసిగట్టిన అతడు 'మనిషే!' అనుకున్నాడు. ఆ మనిషి మగవాడని అర్థమౌతోంది. ప్యాంటు, షర్ట్ ధరించి నీట్‌గా టక్ చేసుకున్నాడు.

"ఎవరు నువ్వు?" గద్దించాడు రచయిత.

"నేనెవరో నీకు తెలియదా?"

"తెలియదు"

"నన్ను సృష్టించిన నీకే గుర్తులేనన్న మాట"

రచయిత విస్తుపోయి "ఏమిటి నువ్వు మాట్లాడేది?" అన్నాడు.

"అవును. నన్ను సృష్టించింది...నువ్వే!"

"నీ మాటలు నాకు బొత్తిగా అర్థం కావటం లేదు"

"నేను... నీ కథలోని పాత్రను"

ఆ మాటలకు రచయిత శరీరంలో ఉత్సుకతతో కూడిన అలజడి బయలుదేరింది. వక్షం ముందుకు వంగింది. చూపు తదేకమయింది. నోరు తెరుచుకుని పోయింది.

"అంటే నువ్వూ..." ఆ వ్యక్తి వైపు వేలు చూపిస్తూ ఆగాడు.

"గోపీని"

రచయిత స్థాణువైపోయాడు. సడన్‌గా అతడికి దాహం వేసింది. ప్రక్కనున్న ఫ్రిజ్ వద్దకు గబగబా వెళ్లి కూలింగ్ వాటర్ రెండు గుక్కలు తాగాడు. యథాస్థానంలోకి వచ్చి కూర్చుని ముఖానికి పట్టిన చెమటను తుడుచుకున్నాడు. టీని కొద్దిగా సిప్‌చేసి సిగరెట్ దమ్ము లాగాడు. ఇపుడతనికి కొంచెం స్థిమితంగా ఉంది. పరిస్థితిని పూర్తిగా ఆకళింపు చేసుకున్నాడు. గడ్డం క్రింద చెయ్యిపెట్టుకుని తను సృష్టించిన గోపీ వంక అదేపనిగా చూస్తూ టీ, సిగరెట్ మార్చి మార్చి పీల్చసాగాడు.

అంతలో కప్‌బోర్డ్‌లో ఉన్న అలారం ట్రింగ్ మని మోగింది. రచయిత ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. అలారం టైమ్ ఎవరు మార్చారు?' అని తిట్టుకుంటూ కుర్చీలోంచి లేచాడు. ఆ లేవటంలో కప్పులోని టీ ఒలికి అతను వ్రాస్తున్న కాగితం మీద ఒలికింది.

"ఓ...!" అతడి నోటి వెంట అప్రయత్నంగా వచ్చింది. కాగితం పూర్తిగా పాడయింది. ఇక చేసేది లేక దాన్ని రెండు ముక్కలుగా చించి పారేసి గోపి వంక చూశాడు.

ఆశ్చర్యం... అక్కడ గోపీ లేదు.

"గోపీ... గోపీ...!" రచయిత కంగారుగా అరిచాడు.

సమాధానం లేదు.

రచయితకు ఏదో అర్ధమవసాగింది. వెంట నే మరో తెల్లకాగితాన్ని తీసుకుని అదే వాక్యాన్ని మళ్లీ వ్రాసి తలెత్తి చూశాడు. గోపీ మళ్లీ ప్రత్యక్ష మయ్యాడు. రచయిత సంతోషపడి మిగతా కథని కంటిన్యూ చేసాడు.

– షష్టియర్లో ఉన్న రాధ అతడికి పరిచయ మైంది –

ధడేల్మని పంజాబీ డ్రస్సులో అవతరిం చింది రాధ.

ఆమెను చూసి గోపీ ముగ్ధుడయ్యాడు. గోపీ ని చూసి రాధ పరవశించిపోయింది. 'హాయ్' అని గోపీ పలకరించాడు. 'హలో' అని రాధ సిగ్గుపడింది. ఇద్దర్నీ గమనిస్తున్న రచయిత గర్వపడ్డాడు.

– తొలిచూపులోనే ప్రేమలో పడ్డారు –

గోపీ ముఖం తేజస్సుతో వెలిగిపోతోంది. రాధ ముఖం సొగసుతో మెరిసిపోతోంది. అది చూసిన రచయిత 'ప్రేమ మహత్యం' అనుకుని 'కాదు కాదు... నా మహత్యం' అని మార్చు కున్నాడు. అతడు పెన్ను పక్కన బెట్టి ఫ్లాస్కుని అందుకుని టీ కప్పు మళ్లీ నింపుకున్నాడు. లాస్ట్ పఫ్ కొట్టి సిగరెట్‌ని యాష్ట్రేలో కుక్కేసాడు.

గోపీ రాధను ఆరాధనగా చూడసాగాడు. రాధ గోపీని అనురాగంతో చూడసాగింది. రచయిత మరో సిగరెట్ వెలిగించాడు. ఇద్దరూ ప్రేమ బాణాలు విసురుకుంటూ పరిసరాలను మరచిపోయారు. రచయిత గుండెలనిండా సిగ రెట్ పీల్చి పొగను ఇద్దరి మధ్యకు చేరేలా గుప్పున వదిలాడు. ఆ దెబ్బకు ఇద్దరూ తుళ్లిపడి పోటాపోటీగా దగ్గడం మొదలెట్టారు. అతడి ముఖంలో సన్నని చిరునవ్వు కనిపించి వెంటనే అదృశ్యమైంది.

– ఓ రోజు గోపీ తన మనసులోని ప్రేమను ఆమె ముందు బయట పెట్టాడు. రాధ మారు మాట్లాడకుండా గ్రీన్‌సిగ్నలిచ్చింది –

గోపీ సంతోషంతో ఎగిరిగంతేశాడు. రాధ ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది. అది చాలక ఇద్దరూ ఒకరినొకరు పేర్లుపెట్టి పిలుచుకుంటూ అమాంతం గట్టిగా కౌగలించుకుని, బల్లుల్లా కరుచుకుపోయారు. రచయిత 'నేనిక్కడే ఉన్నా ను' అన్నట్టు గొంతు సవరించాడు.

ఆ శబ్దానికి ఇద్దరూ విడివడిపోయి కాసేపు సిగ్గుపడి, రచయితకి చెరోవైపుగా వచ్చి అతడి చేతులను చెరొకటీ పట్టుకుని అభిమాన పూర్వ కంగా చూసారు. రచయితకి అర్థంకాక ఇద్దరి ముఖాల్నీ మార్చిమార్చి చూడసాగాడు.

"థ్యాంక్యూ! రచయితగారూ..." ఇద్దరూ ఒకేసారి చెప్పారు.

"దేనికి?" తన చేతులు లాక్కుని అన్నాడు.

"మా ఇద్దరి మనసులూ కలిసేలా చేసారు కదా!"

"ఒట్టి థ్యాంక్స్ మాత్రమేనా?"

"ఏం కావాలి?" గోపీ అడిగాడు.

"నాకు డాన్సంటే చాలా ఇష్టం" రచయిత టీ గుక్కవేస్తూ అన్నాడు.

"అయితే?" రాధ ప్రశ్నించింది.

"మీ ఇద్దరూ కలిసి డాన్స్ చేస్తే చూడాలని ఉంది" ఆ మాటలకు ఇద్దరూ బిత్తరపోయి ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నారు. రచయిత టీ తాగుతూ వారి ముఖాల వంక చూడసాగాడు.

"నాకు డాన్స్ రాదు"

"నాక్కూడా రాదు"

"ఫరవాలేదు. ఇదేమన్నా డాన్స్ కాంపిటీ షనా? కాసేపు చేయండి"

"అసలు రాదని చెప్తున్నాం గదా!" ఇద్దరూ

విసుక్కున్నారు.

"ప్లీజ్! నాకోసం చేయండి" రిక్వెస్ట్ చేశాడు.

కానీ వాళ్లు ససేమీరా చేయటం ఇష్టంలేదని తేల్చిచెప్పారు. రచయిత 'అలాగా!' అని కొద్ది సేపు ఆలోచించి "మీ చేత ఎలా డాన్స్ చేయిం చాలో నాకు బాగా తెలుసు" అన్నాడు.

ఇద్దరూ 'ఏం చేస్తాడా?' అన్నట్లు చూస్తు న్నారు.

- గోపీ, రాధ కలిసి తమ ప్రేమ ఫలించిన సందర్భంగా ఫ్రెండ్స్‌కి పార్టీ ఇవ్వాలని పిక్నిక్‌కి తీసుకెళ్లారు. సాయంత్రం వరకూ బాగా ఎంజాయ్ చేసారు. తిరిగివచ్చే ముందు అంద రూ గోపీని, రాధనూ కలిసి డాన్స్ చేయాలని కోరారు. వాళ్లు వెంటనే ఒప్పుకున్నారు -

అని రచయిత కథ కంటిన్యూగా రాసేసి సిగరెట్ దమ్ములాగాడు. అతడు చేసిన పనికి ఇద్దరికీ తల తిరిగిపోయింది. అతడు మాత్రం నిశ్శబ్దంగా లేచి సీడీ ప్లేయర్ ఆన్ చేశాడు. ఇక చేసేదిలేక ఇద్దరూ డాన్స్ మొదలెట్టారు. గోపీ కాళ్లు రెండూ ఎడంచేసి భుజాలను ఒకటే పనిగా ఎగరేస్తున్నాడు. రాధ రెండు చేతులూ పైకెత్తి పాదాలను నేలకేసి తపాతపా బాదు తోంది. రచయితకు విపరీతంగా నవ్వొచ్చింది. కానీ పెద్దగా నవ్వితే వాళ్లు సరిగ్గా డాన్స్ చేయ రని, చిరునవ్వుతో చూస్తూ సిగరెట్ దమ్ములు పీకసాగాడు. ఇద్దరికీ ఇపుడు సిగరెట్ పొగ బాగా అలవాటయింది.

"రాధా! ఆ స్టెప్పు మార్చు... ఛండాలంగా ఉంది. సర్కస్‌లో చింపాంజీ చిందులు తొక్కు తున్నట్టుంది" గోపీ అన్నాడు.

"నీది మాత్రం బావుందనుకుంటున్నావా? పక్షవాతం వచ్చిన వాడికి టీకాలువేస్తే గిజగిజ లాడినట్టుంది" రాధ అంది.

రచయిత ఫకాలున నవ్వాడు.

"చూడు... ఎలా నవ్వుతున్నాడో! అంట్ల వెధవ!" తిట్టింది రాధ.

"వాడిసొమ్మేం పోయింది... అడ్డగాడిద!" గోపీ కూడా అందుకున్నాడు.

కానీ జరగకూడనిది అప్పటికే జరిగిపో యింది. వాళ్లు తిట్టిన తిట్లు రచయిత చెవిలో పడ్డాయి.

"ఏమిటి?" చివ్వున లేచాడు రచయిత.

గోపీ బెదిరిపోయి "ఏవుంది? ఏంలేదే!" నసిగాడు.

రాధ భయపడి "ఏవుంది? రాక్ అండ్ రోల్" కాళ్లు తిప్పుతోంది.

గోపీ తేరుకుని "అవా! రోకళ్లతో రోలు దంచేటపుడు ఆహూ! ఆహూ! అంటారు కదా. అలాగే రాక్ అండ్ రోల్ వేసేటపుడు యాహూ! యాహూ! అన్నాం... అంతే" నోటికొచ్చినట్టు మాట్లాడాడు.

"కథలు రాసే నాకు హరికథలు చెప్తావా!" సిగరెట్ స్పీడుగా పీలుస్తూ ముక్కుల్లోంచి పొగ వదిలాడు.

"హరికథకాదు, బుర్రకథకాదు... పచ్చి నిజం. నిన్ను మేము ఎందుకంటాం చెప్పు? నువ్వు విజ్ఞుడివి, లౌక్యుడివి, మేధావివి. ఇం కా..." రాధ మునగ చెట్టుకి నిచ్చెన వేయబో యింది.

"అంట్లవెధవని, అడ్డగాడిదని... కదూ!"

రాధ ఖంగుతింది. గోపీ గుటక వేసాడు.

"మీ పని చెప్తాను... ఉండండి!" రచయిత విసురుగా కుర్చీలో కూర్చుని పెన్ను అందుకు న్నాడు. పేపర్ మీద ఏం అఘాయిత్యం చేయటా నికి రాయబోతున్నాడోనని ఇద్దరూ కిక్కురుమన కుండా మిడిగుడ్లు వేసుకుని చూడసాగారు.

– స్నేహితులు చప్పట్లు కొడుతూ బాగా ఎంకరేజ్ చేస్తూ వుండటం వల్ల ఇద్దరూ రెచ్చిపోయి స్టెప్పుల వేగం పెంచారు. ఆ స్పీడుకి ఒకరి కాలు ఒకరు తట్టుకుని దభీమని క్రింద పడ్డారు –

టేబుల్‌కి ఎదురుగా పెద్దశబ్దం వచ్చింది.

"అబ్బా! నడుములు విరిగాయిరా నాయనా!" గోపీ గావుకేక పెట్టాడు.

"అమ్మా! కూసాలు కదిలాయిరా దేవుడా!" రాధ పొలికేక పెట్టింది.

రచయిత ముసిముసిగా నవ్వుకుంటూ టీ కప్పుని అందుకున్నాడు. అది బాగా చల్లారిపోయి వుండటం వల్ల ఒకే గుక్కలో మొత్తం తాగేసాడు. గోపీ, రాధ లేవలేక క్రిందా మీదా పడుతున్నారు.

"ఊ! తెలిసిందిగా. ఇంకెపుడూ నాతో తమాషాలాడవద్దు. అర్థమైందా?" రచయిత సిగరెట్ దమ్ములాగి హెచ్చరించాడు.

"అర్థమైంది బాబూ! మాకు బుద్ధొచ్చింది. ఇంక నిన్నేమీ అనం. మమ్మల్ని కొంచెం లేవదీయి" ఇద్దరూ కాళ్లబేరానికొచ్చారు.

రచయిత మరో దమ్ముకొట్టి సిగరెట్‌ని చిదిమేసి పైకి లేచాడు. వాళ్ల దగ్గరకు వెళ్లి చెరొక చేయి అందించి పైకి లేవదీశాడు. ఇద్దరూ వీపుల మీద చేతులు వేసుకుని చిన్నగా లేచి నిలబడ్డారు. ఒళ్లంతా ఒకటే నొప్పులు. కొద్దిసేపు అటుఇటూ అడుగులు వేసేసరికి కొంచెం తగ్గినట్టు అనిపించాయి.

చివరికి 'హమ్మయ్య!' అనుకుని నిటారుగా నిలబడ్డారు. ఈ లోపు రచయిత మూడు కప్పులలో వేడివేడి టీ నింపాడు. తనొకటి తీసుకుని ఇద్దరికీ చెరొకటి ఇవ్వబోయాడు.

కానీ వాళ్లు "మా కొద్దు!" అన్నారు.

"అలిగారా?"

మౌనంగా ఇద్దరూ తలలు దించారు.

"సరే మీ ఇష్టం" రచయిత కప్పులు టేబుల్ మీద పెట్టి తన యధాస్థానంలో కూర్చుని కథ రాసే పనిలో పడిపోయాడు.

– గోపీకి ఎగ్జామ్స్ అయిపోయాయి. రాధ సెకండ్ ఇయర్‌కి వచ్చింది. ఇద్దరూ తమ ప్రేమ సంగతి తమతమ వాళ్లకు చెప్పాలని నిర్ణయం తీసుకున్నారు. ముందుగా గోపీ తనవాళ్లకు చెప్పాడు. ఆ తర్వాత రాధ తన వాళ్లకు చెప్పింది. ఇరు కుటుంబాలూ వాళ్ల ప్రేమను...

రాయటం ఆపేసి రచయిత సిగరెట్ వెలిగించాడు. గోపీకి గుండె వేగం నిమిషానికి వందపైన పెరిగింది. రాధకు ఒంటినిండా చెమటలు పట్టి డ్రస్సు తడిసింది. రచయిత ఒక్కొక్క దమ్మూ కొడుతూ, టీ గుక్కలు మింగివేస్తూ ఇద్దరి తాపత్రయాన్ని ఎంజాయ్ చేయసాగాడు. ఇద్దరూ ఏం మాట్లాడితే ఏమౌతుందోనని భయపడి నిశ్శబ్దంగా చూస్తూ... టెన్షన్ తట్టుకోలేక నానా అవస్థ పడుతున్నారు. రచయిత మెల్లగా పెన్నుకి పనిచెప్పాడు.

– అంగీకరించారు. పెళ్లికి కూడా నిశ్చయ తాంబూలాలు ఇచ్చి పుచ్చుకున్నారు –

"యాహూ!" గోపీ రెండు చేతులూ పైకెత్తాడు.

"హుర్రే!" రాధ కూడా వంతపాడింది.

ఆ గోలకు రచయిత చెవులు గట్టిగా మూసుకున్నాడు. ఇద్దరూ ఒకరినొకరు పొదివి పట్టుకుని, ఒకరికళ్లలోకి మరొకరు చూసుకుంటూ గట్టిగా వాటేసుకున్నారు. అంతటితో ఆగక క్రమంగా వాళ్లు హద్దు మీరారు. గోపీ ఆమె చెక్కిళ్లను ముద్దాడుతుంటే, రాధ అతడి నుదుటిని చుంబించసాగింది. ఆ దృశ్యాన్ని చూస్తున్న

రచయితకు ఎందుకో సంతోషంగా అనిపించింది. కానీ వెనువెంటనే అది అదృశ్యమై అతడిలో కోపం ప్రత్యక్షమైంది.

"స్టాపిట్" అరిచాడు రచయిత.

అయినా వాళ్లీ లోకంలోకి రాలేదు. ఇలాగయితే చాలా డేంజరని ఊహించిన రచయిత వాళ్లమీదకు ఓ పుస్తకాన్ని విసిరాడు. అది ఎగిరివెళ్లి ఇద్దరి మూతులకూ తగిలేసరికి స్పృహలోకి వచ్చారు.

"ఏమిటి మీరు చేస్తున్న పని?" రచయిత గదమాయించాడు.

"ఉయార్ వెరీ సారీ!" క్షమాపణ అడిగారు.

రచయిత చల్లబడి "సర్లే! ఇప్పుడైనా టీ తాగుతారా?" అన్నాడు. అభ్యంతరం చెప్పకుండా చెరొక కప్పుని అందుకుని అతడి వైపు కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ టీ తాగసాగారు.

"నువ్వు చాలా మంచివాడివి. మా ప్రేమను అర్ధంచేసుకుని దానికి సార్ధకతను చేకూర్చావు" గోపీ అన్నాడు.

"నీకెలా కృతజ్ఞత చెప్పాలో అర్ధం కావటం లేదు. ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలమో తెలియటం లేదు" రాధ అంది.

రచయిత చిరునవ్వు నవ్వాడు.

"నీ కోరిక ఏదైనా ఉంటే చెప్పు. ఈసారి అడిగిన వెంటనే తీరుస్తాం" గోపీ భరోసా ఇచ్చాడు.

"చెప్పు! ఆటకావాలా? పాటకావాలా?" రాధ రెడీ అయింది.

"ఏమీ వద్దుగాని, ముందు టీ తాగండి" అన్నాడు రచయిత.

ఇద్దరూ తాగేసి కప్పులు బల్లమీద పెట్టారు.

"ఏదైనా మాట్లాడండి!" రచయిత సొరుగులో ఇంకుబాటిల్ తీసాడు. గోపీ, రాధ ముఖముఖాలు చూసుకున్నారు. రచయిత పెన్ను స్క్రూ ఊడదీసి కొద్దికొద్దిగా ఇంకు నింపాడు. బాటిల్‌ని లోపల పెట్టి స్క్రూ బిగించాడు. ఇద్దరూ ఏదో గుసగుసలాడుకొంటున్నారు.

"ఏంటో... మీ రహస్యాలు?" రచయిత పసిగట్టాడు.

ఆ ప్రశ్నకు నువ్వడగమంటే నువ్వడగమని ఇద్దరూ ఒకరినొకరు మోచేతులతో పొడుచుకోసాగారు.

"ఆ అడిగేదేదో త్వరగా అడిగితే బావుంటుంది"

చివరకి ఇద్దరూ కూడబలుక్కుని ఒకేసారి పెదవి విప్పారు.

"మాపెళ్లి కళ్యాణ మండపంలో జరుగుతుందా? లేక గుళ్లోనా?"

"మీ బొంద! మీకసలు పెళ్లికాదు".

బాంబు పేలినట్టు ఇద్దరూ స్థంభించి పోయారు. గోపీ కాళ్లలో శక్తి నశించినట్టు తూలిపడుతూ వెళ్లి గోడకానుకున్నాడు. రాధ కడుపులో ప్రేవులు తోడేసినట్టు నిస్సత్తువతో కుప్పకూలిపోయింది. రచయితకు ఇవేవీ పట్టనట్టు సొరుగులోంచి మరికొన్ని తెల్లకాగితాలు బయటకు తీసి పెట్టుకున్నాడు. కొద్దిసేపటికి ఇద్దరూ కొంచెం తేరుకున్నారు.

"నువ్వన్నది నిజమా?" గోపీ గొంతు నూతిలోంచి వచ్చినట్టుంది.

"లేదు... నేను నమ్మను" రాధ మాట తడబడి నత్తిగా మారింది.

రచయిత తాపీగా "నమ్మకపోతే పోండి. నాకేం?" అన్నాడు.

"మా పెద్దలు ఒప్పుకున్నారుగా!" గోపీ పెదాలు అదురుతున్నాయి.

"ఎంగేజ్‌మెంట్ కూడా అయిందిగా!" రాధ కళ్లు వర్షిస్తున్నాయి.

రచయిత పెన్ను పక్కనబెట్టి కుర్చీలో జారి గిలా వాలిపోయి "పిచ్చివాళ్లారా! పీటలమీద పెళ్లిళ్లనే పెటాకులు చేసాను. ఇదొక లెక్కా?" అన్నాడు.

"ఏం నేరం చేసామని మాకీ శిక్ష విధిస్తున్నావు?"

"ఏ పాపం చేసామని మమ్మల్ని విడదీస్తున్నావు?"

"అబ్బబ్బ! ఆపండి మీ పిచ్చిగోల. ఇందాకట్నుంచి చూస్తున్నాను, సినిమా డైలాగుల్లాగా చెప్పినదాన్నే పదాలు మార్చి మళ్లీ మళ్లీ చెప్పి ఇద్దరూ నన్ను చంపకండి!"

ఇద్దరూ నోటికి తాళాలు వేసారు.

రచయిత ఇంకో సిగరెట్ వెలిగించి "మీకు పెళ్లిచేస్తే ఇక కథలో ట్విస్ట్ ఏముంది? ట్విస్ట్ లేకపోతే కథ ప్రింటవదని మీకు తెలుసు. అర్థం అయిందిగా! ఇక నన్ను డిస్టర్బ్ చేయకండి. నేను కథ పూర్తిచేయాలి" అంటూ సిగరెట్ పొగని గుండెల్నిండా పీల్చి గుప్పున వదిలాడు.

"ప్రింటవకపోతే ఏం బోయిందో?" తమలో తాము గొణుక్కున్నారు.

రచయిత చివ్వున తలెత్తి "ఏం మీకు చెప్పాలా?" కళ్లెర్ర చేసాడు.

"చెప్పాలని మేం డిమాండ్ చేయటం కాదు గానీ అడగటం మా ధర్మం కదా!".

వారి అనలైజేషన్ అతడికి నచ్చింది.

"ఓకే! చెప్తాను... కథ ప్రింటవకపోతే నాకు డబ్బెలా వస్తుంది? గుర్తింపు ఎలా కలుగుతుంది? పరపతి ఎలా పెరుగుతుంది?... ఊ!"

ఆ మాటలు గుండెల్లో గునపాలు గుచ్చుకున్నట్టు వారిలో ఓ నిమిషం పాటు ఎలాంటి చలనం లేదు. రచయిత తన పని తాను చేసుకుంటున్నాడు.

"నీ స్వార్థం కోసం మా జీవితాలతో ఆడుకుంటావా?" గోపీ గదమాయించాడు.

"నీ సుఖం కోసం మా ప్రేమను బలి చేస్తావా?" రాధ నిలదీసింది.

అతడు మాత్రం మౌనంగా రాసుకుంటూ పోతున్నాడు.

"నువ్వు నాశనమై పోతావురా! నీచుడా!" గోపీ కంట్రోల్ తప్పాడు.

"నువ్వు దారుణంగా చస్తావురా! దుష్టుడా!" రాధ బ్యాలెన్స్ తప్పింది.

"మీరెన్నయినా తిట్టుకోండి. నేను మాత్రం చేసేది చేస్తాను. మీతో వాదిస్తూ కూర్చుంటే నా కథ పూర్తవదు" అతడు రాస్తూనే ఉన్నాడు.

వాళ్లు తిట్టిన తిట్లకు అతడు రోషపడకపోయేసరికి వారి కోపం మరింత ఎక్కువైంది. ఇద్దరూ ఈ సారి బండబూతులు మొదలెట్టారు. అయినా రచయిత తొణకలేదు. టీ కప్పులు ఖాళీ అవుతున్నాయి. సిగరెట్ పీకలు లేచిపోతున్నాయి. అతడు పేజీలకు పేజీలు నింపుతూ పోతున్నాడు.

"మీ ఇద్దరికీ సెపరేట్ మ్యారేజెస్ అవటం మాత్రమే కాదు. ఇంకా చాలా కష్టాలు పెడతాను" రచయిత రాయటం ఆపాడు.

ఇద్దరూ ముక్కుపుటాలు ఎగరేసి "ఏంటవి?" అన్నారు.

"చెప్పను. చేసి చూపిస్తాను" మళ్లీ మొదలెట్టాడు.

– గోపీకి వచ్చిన భార్య గయ్యాళి. రాధకు వచ్చిన భర్త శాడిస్టు. గోపీ తండ్రి అప్పులపాలయ్యాడు, తల్లికి లుకేమియా వచ్చింది. రాధ

తండ్రి జైల్లో పడ్డాడు, తల్లికి మతిచలించింది. గోపీ చెల్లెలి పెళ్లి ఆగిపోయింది, రాధ అన్నయ్యని జాబ్‌లోంచి పీకేశారు –

"నో!" ఇద్దరూ పెద్దపెట్టున అరిచారు. రచయిత పెన్ను పక్కన బెట్టి 'క్లైమాక్స్ ఎలా పెట్టాలా?' అని ఆలోచించసాగాడు. ఇద్దరి కోపం తారాస్థాయికి చేరింది. ఉన్నట్టుండి రచయిత బుర్రలో క్లైమాక్స్ ఫ్లాష్‌లాగా వెలిగింది. ఇక ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కలాన్ని కదిలించాడు.

– గోపీ, రాధ ప్రేమ సఫలం కాకపోవటానికి మరియు ఇద్దరి కుటుంబాల అనర్థాలకూ కారణం ఓ అజ్ఞాతవ్యక్తి అని బయటపడింది. ఇద్దరూ కలిసి ఆ వ్యక్తి ఎవరా? అని తెలుసుకునే ప్రయత్నంలో అతడు వాళ్ల చేతుల్లో చనిపోయాడు.

"రేయ్!" గోపి సింహగర్జనతో అతడ్ని చేరుకున్నాడు.

"రేయ్!" రాధ పులి గాండ్రింపుతో అతడ్ని సమీపించింది.

ఊహించని ఈ పరిణామానికి రచయిత స్థాణువైపోయాడు. ఇద్దరి శరీరాలూ ఉక్రోషంతో ఊగిపోతున్నాయి. ముఖాలు అగ్ని జ్వాలల్లా పెళపెళమంటున్నాయి. కళ్లు చింతనిప్పుల్లా కణకణమంటున్నాయి.

రచయిత గుండె గుభేల్‌మంది. తను చేసిన పొరబాటు ఎంత దారుణమైందో అతడికి తెలిసి వచ్చింది. తన పాత్రలకి తనే ఒకళ్లను చంపగలిగే పవరిచ్చాడు. పైగా ఆ వ్యక్తి ఎవరన్నది తాను రాయలేదు. అలా రాసినట్లయితే తన మీదికొచ్చేది కాదు. సస్పెన్స్ కోసం ఓ అజ్ఞాత వ్యక్తి అని రాసాడు. అదే ఇపుడు తన ప్రాణం మీదకు తీసుకువచ్చింది.

ఉన్నట్టుండి రచయితకు మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

టేబుల్ మీద ఉన్న తను రాసిన కథ తాలూకు కాగితాలను ఓరకంట చూసాడు. వాటిని చించి పారేస్తే గోపీ, రాధ అదృశ్యమౌతారని అతడి ఆశ. చటుక్కున చేయిచాచి వాటిని అందుకోబోయాడు.

కానీ వాళ్లు అతడి చేష్టను ముందుగానే పసిగట్టి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అతడ్ని గట్టిగా ఉడుంపట్టు పట్టి కుర్చీలోంచి కదలకుండా చేసారు.

రచయిత బెంబేలెత్తిపోయాడు.

"మాకిన్ని కష్టాలు రావటానికి కారణం నువ్వేరా! ఆ అజ్ఞాత వ్యక్తివి కూడా నువ్వే. నువ్వు పొరబాటున చావటం కాదురా, నిన్ను కావాలనే మేం చంపేస్తున్నాం" కసిగా చెప్పారు.

"మీకు దణ్ణం పెడతా! నన్నొదిలే..."

రాధ కాగితాలతో అతడి నోటిని మూసేసింది.

గోపీ కలాన్ని అతడి గుండెలో దిగబొడిచాడు.

రచయిత ఆఖరి శ్వాస ఆగిపోయింది.

* * *

మరుసటిరోజు ఎప్పటిలానే టేబుల్ మీద తెల్లకాగితాలు రెపరెపమని కొట్టుకొంటున్నాయి, యాష్‌ట్రేలో రెడ్‌విల్స్ సిగరెట్ వెలుగుతోంది, కప్పులో టాప్‌స్టార్ టీ రెడీగా ఉంది.

రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చున్న రచయిత యధావిధిగా కథలు రాస్తూ పోతున్నాడు.

అయితే అతడి కథలలో ఇపుడు తన స్వార్థం కోసం కూడుకున్న భావనలుగానీ, ఛాయలుగానీ లేవు... సమాజసేవ, ఆత్మ సంతృప్తి తప్ప.